అడవి పాలెం గ్రామంలో స్వయానా వృద్ధురాలు కాళ్లు కడుగుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

వృద్ధుల కాళ్లు కడిగి పింఛన్లు అందజేత

ప్రజాశక్తి - యలమంచిలి

పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం అడవిపాలెం, యలమంచిలి, కాజ పడమర, కొంతేరు తదితర గ్రామాల్లోని వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పెన్షన్ లబ్ధిదారులకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం పింఛను సొమ్ము పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసిపి బాధ్యతారాహిత్య పరిపాలన కారణంగా రాష్ట్ర ఖజానాలో చిల్లి గవ్వలేదని తెలిపారు. ఈ పరిస్థితుల్లోనూ ఇచ్చిన మాట ప్రకారం తమ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పింఛన్ సొమ్ము పెంపు చేశారన్నారు. అడవిపాలెం గ్రామంలో మంత్రి రామానాయుడు స్వయానా వృద్ధుల కాళ్లు కడిగి వారికి పింఛన్లు అందజేశారు.

రాయలసీమ యూనివర్సిటీ విసి రాజీనామా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి పంపారు. ఈ ఏడాది జనవరిలో వర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో నియమితులైన అన్ని యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లు తమ పదవులకు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్న క్రమంలో సుధీర్ ప్రేమ్‌కుమార్ కూడా తన పదవి నుంచి తప్పుకున్నారు. రెండు రోజుల క్రితం రిజిస్ట్రార్ నాగుల అంకన్న కూడా రాజీనామా చేశారు.

'ఆ' అధికారులపై ఆరా

- జిఎడి నుంచి పలు శాఖలకు సర్క్యులర్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. వారికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఆ అధికారుల ఇ-మెయిల్స్, ఫోన్ నంబర్లను అందించాలని సంబంధిత శాఖలకు సర్క్యులర్ జారీ చేసినట్లు తెలిసింది. 2019 నుంచి 2024 వరకు వివిధ శాఖల్లో పనిచేసిన కొంతమంది ఐఎఎస్ అధికారులు, ఇతర అఖిల భారత సర్వీసు అధికారులు, ద్వితీయ శ్రేణి అధికారులపై ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లో అనుసరించిన విధానాల వల్ల ఖజానాకు భారీగా నష్టం వాటిల్లినట్లు కూడా తాజాగా ప్రభుత్వం చెబుతోంది. ఇందులో మద్యం శాఖ, సమాచారశాఖ, గనుల శాఖ, పంచాయతీరాజ్, డిజిటల్ కార్పొరేషన్, ఫైబర్‌నెట్ వంటి శాఖలపై ఆరోపణలు మరింత ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొంతమంది అధికారులను బదిలీ చేసిన ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా సాధారణ పరిపాలన శాఖకు రిపోర్ట్ చేయాలని ఆదేశించగా, ఇంకొంతమందిని సెలవుపై వెళ్లాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ శాఖలకు సంబంధించిన అధికారులు ప్రస్తుతం వినియోగిస్తున్న అధికారిక మెయిల్‌తోపాటు, వారి సొంత మెయిల్స్ ఏమైనా ఉంటే వాటి వివరాలను సమర్పించాలని ఆ శాఖల్లోని ప్రస్తుత ఇన్‌ఛార్జ్‌లకు సాధారణ పరిపాలన శాఖ నుంచి మెమోలు వెళ్లినట్లు తెలిసింది. అలాగే ప్రభుత్వం ఇచ్చిన అధికారిక మొబైల్ నంబర్‌తోపాటు వారు వినియోగిస్తున్న సొంత, ప్రయివేటు నంబర్ల వివరాలు కూడా ఆరా తీస్తోంది.

చిన్నారిపై లైంగికదాడి

ప్రజాశక్తి -మధురవాడ (విశాఖపట్నం)

చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన విశాఖపట్నం జిల్లా మధురవాడ పరిధి మల్లయ్యపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. దిశ ఎసిపి సిహెచ్ వివేకానంద తెలిపిన వివరాల ప్రకారం... జివిఎంసి 7వ వార్డు మల్లయ్యపాలేనికి చెందిన పోలిపల్లి తరుణ్ (19) ఆదివారం సాయంత్రం ఆదే గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారికి చాక్లెట్ ఇచ్చి తాము ఉంటున్న మేడపైకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని ఎసిపి వివేకానంద తెలిపారు.

ఢిల్లీ హైకోర్టులో కేజ్రీవాల్ పిటీషన్

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం పాలసీ కేసులో సిబిఐ తనను అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీ హైకోర్టులో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సోమవారం పిటీషన్ దాఖలు చేశారు. సిబిఐ కస్టడీ విధించడాన్ని కూడా కేజ్రీవాల్ తన పిటీషన్‌లో ప్రశ్నించారు. జస్టిస్ నీనా బన్సాల్ కృష్ణ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటీషన్‌ను మంగళవారం విచారించే అవకాశం ఉంది. ఈ కేసులో ఇడి కేజ్రీవాల్‌ను మార్చి 21న అరెస్టు చేయగా, స్థానిక కోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. అనంతరం సిబిఐ ఆయనను అరెస్టు చేసింది. ప్రస్తుతం సిబిఐ కస్టడీలో కేజ్రీవాల్‌ను ఉన్నారు. తన లాయర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భేటీ అయ్యే అవకాశం కల్పించాలని కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటీషన్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు సోమవారం తిరస్కరించింది.

ఉపాధి బకాయిలకై ధర్నాలు

ప్రజాశక్తి - అమలాపురం / పార్వతీపురం టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న కార్మికులకు ఒక్కొక్కరికి ఆరు నుంచి ఏడు వారాల బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. అమలాపురంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్‌ఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దడాల సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంపైనే ఆధారపడి వేలాది మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నెలల తరబడి వేతన బకాయిలు ఉంచడం తగదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధిని హార్టీకల్చర్‌కు అనుసంధానం చేస్తూ మంత్రి పవన్‌కల్యాణ్ సంతకం చేయడం అన్యాయ మన్నారు. దీనిపై పునరాలోచన చేయాలని కోరారు. ఇతర రంగాలకు నిధులను మళ్లిస్తే ఉపాధి కార్మికులకు పనులు ఎక్కడ కల్పిస్తారని ప్రశ్నిం చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పనులన్నింటినీ గుర్తించి ఉపాధి హామీ చట్టంలో చేర్చాలని సూచించారు.

రెండు పూటలా పని నిబంధన రద్దు చేయాలని ధర్నా

పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద, ఎంపిడిఒ కార్యాలయాల వద్ద ఉపాధి కార్మికులు ధర్నాలు చేశారు. పార్వతీపురంలో జరిగిన ధర్నాలో సిఐటియు నాయకులు రెడ్డి వేణు, జి.వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.రాము మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టం కింద చేస్తున్న పనులు రెండు పూటలా చేయాలనే నిబంధనను రద్దు చేయాలని, వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కొమరాడ ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఎపిఒకు వినతి పత్రాలు అందజేశారు.

అమలాపురం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దడాల సుబ్బారావు

4న బంద్ జయప్రదం చేయాలి

- విద్యార్థి సంఘాల పిలుపు
- పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యార్థి సంఘాల కేంద్ర కమిటీ పిలుపునిచ్చిన విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీలు పిలుపునిచ్చాయి. నీట్, నెట్ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజ్‌లపై సమగ్ర విచారణ జరపాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జులై 4న విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్ఓ, ఎస్ఎస్ఎఫ్ఐ, పిడిఎస్ఓ, పిడిఎస్ఓ, పిడిఎస్ఒ సంఘాల నాయకులు పోస్టరును సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎ అశోక్, ఎస్ఎస్ఓఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్, పిడిఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్, కిరణ్, ఐసా రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. నీట్, నెట్ లీకేజ్‌లతో లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని చెప్పారు. ఐదేళ్లుగా 65 పేపర్లు లీక్ అయ్యాయని, కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని విమర్శించారు. ఇవన్నీ తెలిసి కూడా కేంద్ర విద్యాశాఖ మంత్రిపై చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వన్ నేషన్, వన్ ఎగ్జామ్ అనే ముసుగులో మొత్తం పరీక్ష వ్యవస్థ కుప్పకూలిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఎన్‌టిఎను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సిహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అమర జవాన్ల కుటుంబాలకు రూ.కోటి చొప్పున సాయం : జగన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

లడాఖ్‌లో యుద్ధ ట్యాంకు కొట్టుకుపోయిన ప్రమాదంలో జవాన్లు ప్రాణాలు కోల్పోవడం పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ముగ్గురు జవాన్లు మరణించడం విచారకరమని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి చొప్పున ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రమాదంలో కృష్ణా జిల్లా పెడన మండలం చేవెండ్ర గ్రామానికి చెందిన సాదరబోయిన నాగరాజు, ప్రకాశం జిల్లా రాచర్ల మండలం కాల్వపల్లె గ్రామానికి చెందిన జూనియర్ కమిషన్డ్ అధికారి ముత్తుముల రామకృష్ణారెడ్డి, బాపట్ల జిల్లా రేపల్లె మండలం ఇస్లాంపూర్‌కు చెందిన సుభాన్‌ఖాన్‌ల కుటుంబాలకు సంతాపాన్ని తెలిపారు. వీరి అంత్యక్రియల్లో పాల్గొని వారి కుటుంబాలకు బాసటగా నిలవాలని వైసిపి నియోజకవర్గ నేతలను కోరారు.

మాజీ మంత్రి 'చెల్లుబోయిన' తల్లి మృతి పట్ల సంతాపం

మాజీ మంత్రి, వైసిపి సీనియర్ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తల్లి చెల్లు బోయిన సుభద్రమ్మ మరణం పట్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.

రికార్డు స్థాయిలో పింఛన్ల పంపిణీ

- మొదటి రోజునే 95 శాతం మందికి అందజేత
- సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమర్థవంతమైన నాయకత్వం, ఆదర్శవంతమైన నాయకుడు వుంటే ప్రభుత్వ ఉద్యోగులు ఎంత స్ఫూర్తిదాయకంగా పనిచేస్తారనేదానికి సోమవారం జరిగిన పెన్షన్‌ల పంపిణీ ప్రక్రియనే నిదర్శనమని సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఈ పెన్షన్‌ల పంపిణీని సమర్థవంతంగా పనిచేయగలిగిన వ్యవస్థ ప్రభుత్వంలో వున్నప్పటికీ ఏప్రిల్ నెలలో అప్పటి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా, రాజకీయంగా బురద జల్లడం కోసం వలంటీర్లు లేకపోతే పెన్షన్లు పంపిణీ చేయడం సాధ్యం కాదని కొంతమంది ప్రాణాలు పోవడానికి కారకులయ్యారని విమర్శించారు. రాష్ట్రంలో ఒకేరోజు 12 గంటల పరిధిలో 95 శాతం మందికి పెన్షన్లు అందించిన సచివాలయ ఉద్యోగులతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగులను అభినందిస్తూ ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. గతంలో తాము సచివాలయ ఉద్యోగులతో పెన్షన్‌ల పంపిణీ ప్రక్రియ చేపట్టాలని కోరితే గత ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని విమర్శించారు. చిత్తశుద్ధితో కనీస ప్రయత్నం కూడా చేయకుండా అమాయకుల ప్రాణాలు తీసిందన్నారు. 65.18 లక్షల లబ్ధిదారులకు 28 కేటగిరిలో దాదాపు రూ.4,408 కోట్ల పంపిణీ లక్ష్యంగా పెట్టుకుని 61.76 లక్షల మంది లబ్ధిదారులకు దాదాపు రూ.4,170 కోట్లను పంపిణీ చేశారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయంగా ఈ పెన్షన్‌ల ప్రక్రియ నిలిచిపోతుందన్నారు. గతంలో 85 శాతానికి మించి ఏనాడూ పంచలేకపోయారన్నారు. రాష్ట్రంలో రూ.35తో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పెన్షన్ ప్రారంభిస్తే రూ.వెయ్యికి, రూ.రెండు వేలకు తీసుకెళ్లిన ఘనత చంద్రబాబుది అని అన్నారు. మళ్లీ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కేవలం 15 రోజుల్లో రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచిందన్నారు.

డిఎస్‌సిలో ఎస్‌జిటి పోస్టులు పెంచాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిఎస్‌సిలో ఎస్‌జిటి పోస్టుల సంఖ్యను పెంచాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కె శశిధర్‌కు ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు సోమవారం లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం 16,347 పోస్టుల భర్తీకి డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ చెప్పిన విధంగా డిసెంబరు నాటికి పూర్తిచేయాలని కోరారు. నోటిఫికేషన్‌లో ఎస్‌జిటి పోస్టులు నెల్లూరు, ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాల్లో తక్కువగా ఉన్నాయని తెలిపారు. ప్రకాశంలో 124, నెల్లూరులో 104, శ్రీకాకుళంలో 144 మాత్రమే ఉన్నాయని వివరించారు. ఐదేళ్లుగా నోటిఫికేషన్ లేకపోవడంతో అనేక మంది అభ్యర్థులు అవకాశాలు కోల్పోయారని తెలిపారు. కావున వయోపరిమితి 47 ఏళ్లుగా చేయాలని కోరారు. గతంలో డిఎస్‌సిలో ఎంపికైన ఉపాధ్యాయులు రెండేళ్లపాటు అప్రంటీస్ విధానం చేయాల్సి వచ్చేదని తెలిపారు. అనేక పోరాటాల ఫలితంగా అప్రంటీస్ విధానం రద్దయిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లో రెండేళ్ల అప్రంటీస్ విధానం తిరిగి ప్రవేశపెడతామని పేర్కొన్నారు. కొత్తగా వచ్చే నోటిఫికేషన్‌లో అప్రంటీస్ విధానం లేకుండా ఇవ్వాలని కోరారు.

కవిత బెయిల్ పిటిషన్లు తిరస్కరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన రెండు వేర్వేరు బెయిల్ పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. కుంభకోణంలో ప్రమేయం ఉందన్న ఆరోపణలతో మార్చి 15న కవితను ఇడి అధికారులు అరెస్టు చేశారు. ఏప్రిల్ 11న సిబిఐ విచారణ కోసం రెండు రోజులు కస్టడిలోకి తీసుకున్నారు. ఆ తరువాత ఆమెను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆమె ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. సిబిఐ, ఇడి కేసుల్లో బెయిల్ మంజూరు చేయాలని ఆమె ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసింది. విచారణ జరిపిన న్యాయస్థానం బెయిల్ నిరాకరిస్తూ తీర్పు ఇచ్చింది.

పాత చట్టాల కిందే ఒకటికి ముందు నేరాల విచారణ : అమిత్ షా

న్యూఢిల్లీ : నూతన నేర చట్టాలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చినట్లు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. 2024 జులై 1 ముందు జరిగిన నేరాల విచారణ పాత నేర చట్టాల కిందే జరుగుతుందని తెలిపారు. సోమవారం న్యూఢిల్లీలో అమిత్‌షా విలేకరులతో మాట్లాడారు. పాత చట్టాల స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బిఎస్ఎ)ను మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. జులై 1, ఆ తరువాత జరిగిన నేరాలన్నీ నూతన చట్టాల కిందే విచారణ జరుగుతుందని చెప్పారు. 'టెక్నాలజీ ఇంకా అన్ని పోలీస్‌స్టేషన్లకు అందలేదని నేను అంగీకరిస్తున్నా, కానీ బిఎన్ఎస్ దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది' అని చెప్పారు. భారతీయ సాక్ష్య అధినియం (బిఎస్ఎ)ను అన్ని కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ ఆగస్టు 15లోగా అమల్లోకి తీసుకురావడానికి కొంత సన్నద్ధత అవసరమని, కానీ బిఎన్ఎస్, బిఎన్ఎస్ఎస్‌కు అది అవసరం లేదని కేంద్ర మంత్రి చెప్పారు.

రాష్ట్రానికి కేంద్రం చేయూత ఇవ్వాలి

- టిడిపి నేత లావు శ్రీకృష్ణదేవరాయలు

న్యూఢిల్లీ బ్యూరో: ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం చేయూతనివ్వాలని టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. సోమవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు 90 శాతం సీట్లు, 56 శాతం ఓట్లతో ఎన్‌డిఎ కూటమిని గెలిపించారని చెప్పారు. పోలవరం, అమరావతి నిర్మాణం వేగంగా పూర్తి చేయడానికి నిధులివ్వాలని కోరారు. రాష్ట్రానికి రావాల్సిన రెవెన్యూ గ్రాంట్స్ విడుదల చేయాలన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన విద్యా సంస్థల నిర్మాణం వేగంగా చేయాలన్నారు.

రాష్ట్రాల అధికారాలు నిర్వీర్యం

- బిజెపితో రాముడు లేడు...
- రాజ్యసభలో సిపిఎం నేత జాన్ బ్రిట్టాస్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై ప్రతిపక్షాలు విరుచుకుపడ్డాయి. సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ.. మైనారిటీలను అవమానిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ సహా బిజెపి నేతలు తమ ప్రమాణ స్వీకారాన్ని చేశారని అన్నారు. రాజస్థాన్‌లోని బాన్సువాడలో మోడీ ప్రసంగిస్తూ.. ముస్లిములను చొరబాటుదారులుగా, ఎక్కువ మంది పిల్లలకు జన్మనిచ్చేవారిని అవమానించారని అన్నారు. బిజెపి బుల్‌డోజర్ పార్టీగా మారుతోందని, కమలం చిహ్నాన్ని బుల్డోజర్‌గా మార్చవచ్చునని వ్యాఖ్యానించారు. మొరాదాబాద్‌లో నిన్న ఐదిళ్లు నేలమట్టమయ్యాయని విమర్శించారు. బిజెపితో శ్రీరాముడు లేడని ఎన్నికలు రుజువు చేశాయన్నారు. రామమందిరం నిర్మించిన ఫైజాబాద్‌లో బిజెపి ఓడిపోయిందని, నాథూరామ్ బిజెపితో ఉన్నారని, శ్రీరాముడు కాదని విమర్శించారు. అయోధ్యకు వెళ్లిన మోడీ మణిపూర్ వైపు వెనుదిరిగి చూడలేదని అన్నారు. కేంద్రం నిర్వహించే అన్ని పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అవుతున్నాయని, లక్షల మంది విద్యార్థులు కలలు కల్లోలం అయ్యాయని, పరీక్షల నిర్వహణను రాష్ట్రాలకే వదిలేయాలని డిమాండ్ చేశారు. దక్షిణాది విద్యార్థులకు ప్రవేశాన్ని నిరాకరించడానికి జెఎన్‌యు సహా కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో కొత్త ప్రవేశ పరీక్షను ప్రవేశపెట్టారని విమర్శించారు. పాఠ్యపుస్తకాలు కవిత్వీకరించబడ్డాయని, గాంధీజీ జ్వరంతో చనిపోయారని, ఆస్పత్రికి నాథూరామ్ తీసుకెళ్లారని బోధిస్తారని

వ్యాఖ్యానించారు. రాష్ట్రాల అధికారాలను లాక్కొని ఆర్థికంగా కుంగదీస్తోందని, కేరళ, కర్ణాటక నిరసనలు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఎలక్టోరల్ బాండ్ స్కామ్‌తో బిజెపికి వేల కోట్లు వచ్చాయని, కోచింగ్ సెంటర్లు, బీఫ్ కంపెనీలు కూడా బిజెపికి బాండ్లు ఇచ్చాయని విమర్శించారు.

బ్రిట్టాస్ ప్రసంగానికి ఛైర్మన్ అంతరాయం

రాజ్యసభలో ధన్యవాద తీర్మానం సందర్భంగా జాన్ బ్రిటాస్ ప్రసంగానికి ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ పదేపదే అంతరాయం కలిగించారు. ఆర్ఎస్ఎస్ ప్రచారకులకు ప్రశ్నాపత్రాలు లీక్ అవుతున్నాయన్న వ్యాఖ్యలను రికార్డు నుంచి తొలగించాలని బ్రిట్టాస్‌ను ధన్‌ఖర్ కోరడంతోపాటు ఆయన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ అనే పదం ఎప్పటి నుంచి 'అన్‌పార్లమెంటరీ'గా మారిందని బ్రిట్టాస్ ఛైర్మన్‌ను ప్రశ్నించారు. బ్రిట్టాస్ ప్రసంగం తప్పుదారి పట్టించిందని, దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారని ధన్‌ఖర్ అన్నారు. మీరు తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని బ్రిట్టాస్ తిప్పికొట్టారు. ఛైర్మన్ స్వయంగా ప్రసంగాన్ని అడ్డుకోవడం సరైన చర్య కాదని అన్నారు. బిజెపి సభ్యులు కూడా పలుమార్లు జోక్యం చేసుకున్నారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ, మహువా మొయిత్రా, ఎ రాజా, మనీష్ తివారీ తదితరులు, రాజ్యసభలో మల్లికార్జున్ ఖర్గే, సంజయ్ సింగ్, మనోజ్ ఝా, తిరుచ్చి శివ తదితరులు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. మంగళవారం లోక్‌సభలో చర్చకు ప్రధాని మోడీ సమాధానం ఇవ్వనున్నారు.

FINKURVE FINANCIAL SERVICES LIMITED
Corporate Office : Trade World, D-Wing, 2nd Floor, 202, Kamala Mill Compound Lower Parel (W), Mumbai, Maharashtra - 400013

PUBLIC NOTICE

Finkurve Financial Services LTD. through his facilitated partner Augmont Gold Tech Pvt. Ltd. వారి వద్ద తనఖా పెట్టిన బంగారు ఆభరణాల వేలం తేదీ: 05.07.2024 న సమయం 10 గంటలకు Augmont Gold For All, Door No. 26-25-29, 1st Floor, Gnavoluvari Street, Gandhi Nagar, BRTS Junction, Vijayawda - 520003. వద్ద జరుగుతుంది అని ఇందుమూలంగా ప్రజలకు తెలియజేయచున్నము. వివిధ ఖాతాదారులు తమ బకాయిలు చెల్లించడంలో. విఫలమైన కారణముగా వేలం జరుగుచున్నది. వేలం పాట నోటీసులు ఈ రుణగ్రహీతలకు కూడా జారీ చేయబడ్డాయి. గడువు తీరిన మరియు మార్జిన్ తక్కువ ఖాతాల వివరాలు బ్రాంచ్ వారిగా క్రింద ఇవ్వబడినది.

VIJAYWADA : VIJA-79888.

More Details, Contact : Arja Vara Prasad, Mob.: 8639248394

(Reserves the right to alter the number of accounts to be auctioned & / postpone / cancel the auction without any prior notice)

KARVY FINANCE — స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

కార్పొరేట్ ఆఫీసు: మెసర్స్ కార్వీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, 301, 3వ అంతస్తు, గుజ్రాల్స్ హౌస్, 167 సిఎస్‌టి రోడ్, కాలివెరీ ఏరి విలేజ్, కలినా, శాంతక్రజ్ (ఇ), ముంబయి-400098

ఏదైతే, క్రింది సంతకందారు కార్వీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (చట్టం, 2002) మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని సదరు నోటీసు/ల స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసు జారీచేయబడినది.

రుణగ్రహీత/లు మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత/లు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్8 తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (4) క్రింద అతనికి/ఆమికు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు.

ప్రత్యేకించి రుణగ్రహీత/లు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తులతో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తులతో ఏదేని లావాదేవీలు జరుపుట అనునది కార్వీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ వారికి రుణ ఒప్పంద ప్రకారం డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీని చెల్లించుటకులోబడి ఉంటుంది. సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13యొక్క ఉప-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీత శ్రద్ధవహించగలరు.

| రుణ ఖాతా నెం./రుణగ్రహీత/ సహ-రుణగ్